క్లుప్తంగా

నేడు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

జనగామ: జిల్లా కేంద్రంలోని సిద్దిపేట రోడ్డు బృంధావన్ గార్డెన్‌లో నేడు (బుధవారం) జనగామ పట్టణ బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు జరిగే సమ్మేళనానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

రేపు రక్తదాన శిబిరం

నర్మెట: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో రేపు(గురువారం) అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యాన మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యూత్ అధ్యక్షుడు పల్లె ప్రభుదాస్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు, మండల పరిసర గ్రామాల ప్రజలు కూడా ఈ రక్తదాన శిబిరంలో పాల్గొనాలని, తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

నియామకం


శ్రీనునాయక్

కొడకండ్ల: జైభారత్ ఎస్టీ పోరాట వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా కొడకండ్ల మండలం కడగుట్టతండాకు చెందిన భూక్య శ్రీనునాయక్ నియామకమయ్యాడు. ఈ మేరకు జైభారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణమూర్తి శ్రీనునాయక్‌ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజనులకు సంబంధించిన పోడు భూముల సమస్య, వారికి హక్కుల కల్పన కోసం ప్రభుత్వంపై పోరాడుతానని తెలిపారు.

సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలి



బచ్చన్నపేట: హిందువులు పండుగలను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని, మన ఆచారాలు తర్వాతి తరాలకు తెలిసేలా చాటి చెప్పాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప అన్నారు. మంగళవారం మండలంలోని లింగంపల్లిలో శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాల కొనుగోలుకు రూ.11,111 విరాళాన్ని అందించారు. మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి, భిక్షపతి, మహేష్, లక్ష్మీనర్సయ్య, కనుకయ్య, బాలకిషన్, ఉమేష్, మధు, గణేష్ పాల్గొన్నారు.

పోచమ్మ తల్లికి బోనాలు

బచ్చన్నపేట: ఎద్దుగూడెంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ తల్లి ఆలయానికి గ్రామస్తులు మంగళవారం బోనాలను చేసి సమర్పించారు. గత నాలుగురోజులుగా నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో చివరి రోజున గ్రామస్తులు డప్పు చప్పుళ్లతో శివసత్తుల పూనకాలతో బోనాలు తీసుకెళ్లారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు ఆవు, లేగ దూడ మృతి

చిల్పూరు: పిడుగుపడి ఆవు, లేగదూడ మృతి చెందాయి. ఈ ఘటన మండలంలోని పల్లగుట్ట గ్రామ శివారు సయ్యద్‌హుస్సేన్‌పల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గొడుగు యాదగిరి వ్యవసాయ బావివద్ద చెట్టుకు ఆవు, లేగదూడలను కట్టివేశాడు. కాగా, మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు, వర్షంతోపాటు పిడుగు పడటంతో రూ. లక్ష విలువ చేసే ఆవు, లేగదూడ మృతి చెందాయి. బాధిత రైతును చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు పరామర్శించారు.

స్టేషన్‌ఘన్‌పూర్: మండల పరిధిలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా కురిసిన ఈదురుగాలుల వర్షంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. తాటికొండలో బండ అశోక్‌కు చెందిన పాడి గేదె, అనంతపురం శ్రావణ్‌కు చెందిన గేదె పిడుగుపడటంతో మృతి చెందాయి. అదే విధంగా ఇప్పగూడెంలో పాత సినిమా టాకీసు వెనుకాల ఉన్న తాటిచెట్టుపై పిడుగు పడి చెట్టు కాలిపోయింది.

వ్యక్తి రిమాండ్

దేవరుప్పుల: మండలంలోని గోప్యానాయక్ తండాలో ఠాగూర్‌పై దాడితోపాటు ఇంటి సామగ్రి ధ్వంసం కేసులో ఇదే తండాకు చెందిన రాహుల్‌ను మంగళవారం కోర్టుకు హాజరుపర్చగా చర్లపల్లికి రిమాండ్ చేసినట్టు ఎస్సై మునావత్ రమేష్‌నాయక్ తెలిపారు. కాగా, ఇదే సంఘటన నేపథ్యంలో తొలుత రాహుల్ వ్యవసాయ భూమిలో ఠాగూర్ తదితరులు అక్రమంగా బాటపెట్టిన విషయమై జరిగిన గొడవపై చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

‘కంటి వెలుగు’ ఓ మహత్తర కార్యక్రమం

జనగామ: అన్ని వర్గాల ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న కంటి వెలుగు ఓ మహత్తరమైన కార్యక్రమమని 20వ వార్డు కౌన్సిలర్ జూకంటి లక్ష్మిశ్రీశైలం అన్నారు. పట్టణంలోని 20వ వార్డు ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం చేపట్టిన కంటి వెలుగు శిబిరాన్ని లక్ష్మి ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చడంతో పాటు కంటి చూపు సమస్య లేకుండా ఉండేందుకు ప్రతిచోట వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వార్డులోని ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. మంగ రామకృష్ణ, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.


జనగామ: కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ లక్ష్మి

అంధత్వ రహితమే ‘కంటి వెలుగు’ లక్ష్యం

రఘునాథపల్లి: అంధత్వ రహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం చేపట్టిందని మండలంలోని ఆంధ్రతండా సర్పంచ్ బానోత్ బన్‌సూర్య అన్నారు. మంగళవారం గ్రామంలో ఆయన వైద్య సిబ్బంది, వార్డు సభ్యులతో కలిసి కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు.

సిబ్బందికి సన్మానం

దేవరుప్పుల: గిరిజన తండాల్లో అంధత్వ నివారణ కోసం పాటుపడిన కంటివెలుగు వైద్య బృందాన్ని మంగళవారం స్థానిక సర్పంచ్ బానోత్ గేమా నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శిబిర వైద్యులు యేల అనిల్‌కుమార్ మాట్లాడుతూ 494 మందికి పరీక్షలు నిర్వహించగా 54 మందికి సత్వరమే కంటి అద్దాలు పంపిణీ చేశామని, మరికొందరికి శస్త్ర చికిత్సలు అవసరం ఉంటే ప్రభుత్వ నేత్రవైద్యశాలలకు సిఫారసు చేశామన్నారు. ఉపసర్పంచ్ ధారావత్ లలిత, వార్డు సభ్యులు నర్సింహ, యాద, గ్రామ కార్యదర్శి సంధ్యరాణి, అంగన్‌వాడీ టీచర్లు ఉపంద్ర, అరుణ, ఆప్తాల్మిక్ బొబ్బిలి, క్యాంపు కోఆర్డినేటర్ భాగ్య, డీఏఓ భద్రి, ఎఎన్ఎంలు సుజాన తదితరులు ఉన్నారు.

హక్యతండాలో స్వచ్ఛభారత్ మిషన్ సర్వే


స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొడకండ్ల: మండలంలోని హక్యతండా గ్రామ పంచాయతీలో స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో మంగళవారం అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించారు. స్వచ్ఛతపై గ్రామస్తులకు అవగాహన కల్పించి ఇంకా చేపట్టాల్సిన పనులపై అధికారులు సర్వే చేపట్టారు. ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను చైతన్య పర్చారు. ఎంపీడీఓ సురేందర్‌నాయక్, సర్పంచ్ రాగ్యానాయక్, మాస్టర్ ట్రైనర్లు సుమన్, నరేందర్, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ కుమారస్వామి, టీఏ అనీల్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఓఏలు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

‘పాలకవర్గాల కుట్రలు తగవు’

దేవరుప్పుల: ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతి నిత్యం ప్రశ్నించే గొంతుకలను కనుమరుగు చేసే పాలకవర్గాల కుట్రలు తగవని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగారపు రమేష్ విమర్శించారు. మంగళవారం మండలంలోని సింగరాజుపల్లిలో సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశానికి పయ్యావుల భిక్షపతి అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడారు. పోరాటాలకు పురిటిగడ్డ అయిన ఈ ప్రాంతంలో నమ్మిన ఆశయం కోసం అమరుల వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు సీపీఎం పాటుపడుతుందన్నారు. సీపీఎం మండల నాయకులు యాదిరెడ్డి, మాధవ రెడ్డి, అయోధ్య, ఇంటి వెంకట్‌రెడ్డి, గడ్డం యాదగిరి, గొడిశాల రాములు, ఉప్పలయ్య, ప్రణయ్ పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ అంటే మోదీకి భయం

స్టేషన్‌ఘన్‌పూర్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అంటే ప్రధాని మోదీకి భయం పట్టుకుందని, అందుకే కుట్రపూరితంగా రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేశారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర అన్నారు. రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వ రద్దును నిరసిస్తూ ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు చేపడుతున్న నిరసన దీక్షల్లో భాగంగా మంగళవారం అంబేడ్కర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. బీజేపీ ప్రజా వ్యతిరేక పార్టీ అని, ప్రజాసామ్యాన్ని ప్రధాని మోదీ ఖూనీ చేస్తున్నారని అన్నారు. అవినీతి అక్రమాలు చేస్తున్న బీజేపీని, ప్రధాని మోదీని తరిమి కొట్టాలని ఆమె పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర, జిల్లా , నియోజకవర్గ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నిరసన దీక్షలో మాట్లాడుతున్న ఇందిర

అనర్హత వేటు అప్రజాస్వామికం

పాలకుర్తి టౌన్: రాహుల్ గాంధీ పార్లమెంట్ సభత్వం రద్దు చేయడం అప్రజాస్వామికం అని పీసీసీ సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణనాయక్ అన్నారు. మంగళవారం పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఒక్క రోజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణనాయక్ మాట్లాడారు. తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సత్యనారాయణ, హమ్యా నాయక్, కాంగ్రెస్ నాయకులు చక్రల రఘు, గిరగాని కుమారస్వామ,పెద్ద కృష్ణమూర్తి, మాచర్ల ప్రభాకర్, జక్కుల రాంరెడ్డి, ముద్దసాని సురేష్, ధరావత్ సురేష్, రాజేష్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు,కార్యర్తలు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో వాటర్ కూలర్ ఏర్పాటు

స్టేషన్‌ఘన్‌పూర్: ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు డివిజన్ కేంద్రంలోని బస్టాండ్‌లో ప్రయాణీకుల సౌకర్యార్థం వాటర్ కూలర్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కంట్రోలర్ రఘువీర్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్‌లలో ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా సంస్థ పనిచేస్తుందని అన్నారు.

పరీక్షప్యాడ్ల అందజేత

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని వాణీ విద్యానికేతన్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను కాంగ్రెస్ నాయకుడు అల్వాల రమేష్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థుల చదువులకు దాతలు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు.

పీఆర్ఎస్ స్థలసేకరణకు రూ.లక్ష విరాళం

దేవరుప్పుల: మండలంలోని పెద్దమడూరులో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ (పీఆర్ఎస్)కేంద్రానికి కావాల్సిన స్థలసేకరణకై బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ రూ. లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పంచాయతీకి ఆయన తమ్ముడు బబ్బూరి నాగరాజు చెక్కును అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా ఉండడమే కాకుండా గ్రామ అభివృద్ధికి పాటుపడడం పట్ల రైతుబంధు గ్రామ కోఆర్డినేటర్ ఆకవరం పెద్దారెడ్డి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, వెంకటేష్, నల్ల ఉమేష్, రాములు, సంపత్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న శ్రీకాంత్‌గౌడ్ కుటుంబ సభ్యులు

వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలి


నర్మెట: మాట్లాడుతున్న రాజు

నర్మెట: ఎస్సీ వర్గీకరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంటులో ప్రవేశపెట్టాలని ఎమ్మెస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుంచు రాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, వీహెచ్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని కొంపెల్లి అంబేడ్కర్ అధ్యక్షతన నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీజేపీ మొండి వైఖరిని నిరసిస్తూ ఈ నెల 31 తలపెట్టిన జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముట్టడికి నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు వంశీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

‘చలో కలెక్టరేట్’ను విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఈ నెల 31వ తేదీన తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ చింత ఎల్లస్వామి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా చేపట్టనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి మాదిగలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నాయకులు తాటికాయల హరికృష్ణ, జలగం శ్రీనివాస్, మండల కోకన్వీనర్ తాటికాయల రాజు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

పాలకుర్తి: అన్ని రకాల చిరుధాన్యాలను వాడటం వల్ల ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని బమ్మెర సర్పంచ్ నాగభూషణం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి అన్నారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో కలిగే లాభాలను వివరించారు. సూపర్‌వైజర్లు భిక్షం, తార, నాగమణి, మహిళలు హాజరయ్యారు.

చిరుధాన్యాలను వినియోగించాలి

నర్మెట: సమతుల్యమైన పోషకాలు ఉన్న చిరుధాన్యాలను ప్రతి ఒక్కరూ వినియోగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతాదేవి అన్నారు. మండలంలోని వెల్దండలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు శాంత, మంజుల, అరుణ, నాగమణి, వార్డు మెంబర్ పాల్గొన్నారు.

కిషోర బాలికలకు రక్త పరీక్షలు

జనగామ రూరల్: ఓబుల్‌కేశవాపూర్ ప్రభుత్వ పాఠశాలలోని కిషోర బాలికలకు మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రక్త పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీఓ రమాదేవి మాట్లాడుతూ విద్యార్థినులు పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. ఆహారంలో చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. టీచర్లు వీరంజనీ, సుమాంజలి, కుమారపస్వామి, రత్నాకర్, రాధకృష్ణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార లోపం లేకుండా చూడాలి

చిల్పూరు: పిల్లలు, గర్భిణుల్లో పోషకాహార లోపం లేకుండా ఐసీడీఎస్, అంగన్‌వాడీలు చూడాలని, అప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొంగరి రవి అన్నారు. మల్కాపూర్‌లో మంగళవారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారంపై టీచర్ శ్రీదేవి అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉప సర్పంచ్ బబ్బుల వంశి, ఎంపీటీసీ మునిపల్లి సుధాకర్, అంగన్‌వాడీలు విజయరాణి, జ్యోతి, వీణ, రోజ, ఏఎన్ఎం పాల్గొన్నారు.

వ్యాధులు దూరం

దేవరుప్పుల: సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన పంటల ఉత్పత్తులైన సిరి ధాన్యాలతో పలు రోగాలు దరికి చేరనవి ఎంపీపీ బస్వ సావిత్రి అన్నారు. మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీతారాంపురం, నీర్మాలలో నిర్వహించిన పోషణ పక్షం వారోత్సవాల్లో ఆమె పాల్గొన్ని ప్రసంగించారు. సూపర్‌వైజర్ శ్రీదేవి, ఎంఎల్‌హెచ్‌పీ జెసికా, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు ఆరోగ్యానికి దోహదం

బచ్చన్నపేట: చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయని ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ పోషణ పక్షం సందర్భంగా చిరు ధాన్యాల్లో ఉండే పోషకవిలువలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు కవిత, జ్యోతి, వనజ, రజిణి, బాలమణి, కౌసల్య, విజయలక్ష్మి, లక్ష్మి, భాగ్యలక్ష్మి, ఆయాలు, తల్లిదండ్రులు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: చిరుధాన్యాల్లో అనేక పోషకవిలువలు ఉన్నాయని సీడీపీఓ ఫ్లోరెన్స్ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణపక్షం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉప్పుగల్లు, వడ్డెగూడెంలో మంగళవారం చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. కాగా, వడ్డెగూడెంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బల్లెపు నర్సింగరావు మాట్లాడారు. సర్పంచ్ గాదెపాక సువర్ణ అయోధ్య, వైస్ ఎంపీపీ కొడారి కనకయ్య, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు అనిత, సుజాత, అంగన్‌వాడీ టీచర్లు రాజకళ, రాజేశ్వరితో పాటు ఉపాధ్యాయులు, అశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్లోకాల పఠనంతో జ్ఞాపకశక్తి

పాలకుర్తి టౌన్: సంస్కృత శ్లోకాల పఠనం వల్ల విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి అభివృద్ధి చెంది మాట ఉచ్చరణ, స్పష్టత, ఉజ్వలమైన భవిష్యత్‌ను ఏర్పర్చుకుంటారని గ్లోబల్ ఫౌండేషన్ జిల్లా ఇన్‌చార్జ్ పూస్కూరి సోమేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో బాల సంస్కర్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ భాషకే మూలమైన సంస్కృతం నేర్పించడం బాల సంస్కర్ కేంద్రాల ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు.


బాల సంస్కర్ కేంద్రం సందర్శనలో సోమేశ్వర్‌రావు

కేంద్రం విధానాలను తిప్పికొట్టాలి

జనగామ రూరల్: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏదునూరి వెంకట్రాజం అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో చలో ఢిల్లీ వాల్ పోస్టర్ ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానలను నిరసిస్తూ ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే ధర్నాలో ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రమేష్, చిరంజీవి, సురేష్, రవి, యాకయ్య, రాజేశ్వరి, రేణుక, సరిత, సుజాత, ఉప్పలయ్య పాల్గొన్నారు.


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సంక్షిప్త సమాచారం

బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ బాసట

దేవరుప్పుల: అనారోగ్యాల బారిన పడి ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి అప్పుల పాలైన బాధిత కుటుంబాలకు సీఎం సహాయ నిధి బాసటగా నిలుస్తుందని ఎంపీపీ బస్వ సావిత్రి అన్నారు. మంగళవారం ధర్మగడ్డతండాలో లబ్ధిదారులకు ఇంటింటా తిరిగి చెక్కులను అందజేశారు. సర్పంచ్ సునీత, బీఆర్ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన ఉపాధ్యాయులు

జనగామ రూరల్: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపడుతున్న ధర్నాకు టీపీటీఎఫ్ నాయకులు మంగళవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు డి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బి.లక్ష్మయ్య, రాజు, అంకుషావలి, వజ్రయ్య, శ్రీరాములు ఉన్నారు.

హనుమాన్ విగ్రహానికి అభిషేకం

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం అర్చకులు చొల్లేటి రాజేశ్వరశర్మ వేదమంత్రాల నడుమ హనుమాన్ విగ్రహానికి అభిషేక నిర్వహించారు. సర్పంచ్ కొంగరి రవి, ఉప సర్పంచ్ వంశి ఉన్నారు.

గాలివానకు కూలిన రామాలయం సెట్టింగ్



చిల్పూరు: మల్కాపూర్‌లో నూతనంగా చేపట్టిన రామాలయ నిర్మాణానికి లక్ష ఖర్చుతో వేసిన ఆలయ సెట్టింగ్ మంగళవారం ఈదురుగాలులతో కూడిన వర్షానికి ఒక్కసారిగా కూలిపోయింది. సీతారాముల కల్యాణం, పట్టాభిషేకం కోసం దాత తీగల రమేష్ ఈ సెట్టింగ్‌ను వేశారు. రాములోరి కల్యాణం కోసం మరింత ముస్తాబు చేస్తుండగా కూలిపోయింది.

సత్కారం

రఘునాథపల్లి: చిన్న వయసులోనే న్యాయమూర్తిగా ఎంపికైన దామెర్ల ప్రీతిని మండలంలోని రామచంద్రగూడెం సర్పంచ్ పయ్యావుల లావణ్యకుమార్ మంగళవారం సత్కరించారు. మంగళవారం మందమర్రి గ్రామానికి చెందిన దామెర్ల సిద్దయ్య, రమ దంపతుల కూతురు ప్రీతి అమ్మమ్మ మాయంకి సత్తమ్మను కలిసేందుకు గ్రామానికి రావడంతో సర్పంచ్ దంపతులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రీతిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

‘బీఆర్ఎస్‌లో సీపీఎం కార్యకర్తలు ఎవరూ చేరలేదు’

పాలకుర్తి: దేవరుప్పల మండలం నిర్మాల గ్రామంలో సీపీఎం పార్టీ కార్యకర్తలు ఎవరూ బీఆర్ఎస్‌లో చేరలేదని సీపీఎం మండల కార్యదర్శి మాచర్ల సారయ్య తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ స్మారకభవనంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మట్లాడుతూ సీపీఎం కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరినారని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. నీతి నిజాయితీతో సీపీఎంలో పని చేసే కార్యకర్తలు ఉన్నారని, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పెట్టే ప్రలోభాలకు ఎవరూ ఆశడరని అన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చిట్యాల సోమన్న, మండల నాయకులు సోమ సత్యం, ఎం నాగయ్య, సోమ అశోక్‌బాబు, ముస్కు ఇంద్రారెడ్డి, రాజు, కమార్ పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం



పాలకుర్తి: మార్గం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాలకుర్తి మండలం ముత్తారం జెడ్పీ హైస్కూల్‌ను దత్తత తీసుకుంటున్నట్లు ఫౌండేషన్ బాధ్యులు మార్గం ప్రేమలత, మార్గం ప్రభాకర్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు స్కూల్ అవసరాల నిమిత్తం మార్గం ప్రేమలత రూ.55 వేల చెక్కును, ప్రింటర్‌కు రూ.15వేలు, బీరువాల కోసం రూ.30వేలను విరాళంగా అందజేశారు. సంజీవ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు నందకుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అన్నప్రాసన

లింగాలఘణపురం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన చేపట్టారు. పోషణ పక్వాడ్‌లో భాగంగా సూపర్‌వైజర్ సావిత్రి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టి చిరుధాన్యాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించారు.

కంటివెలుగు శిబిరాల వద్ద వృద్ధుల అవస్థలు

జనగామ రూరల్: ఎర్రగొల్లపహడ్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరంలో వసతులు సరిగా లేకపోవడంతో వృద్ధులు అవస్థలు పడుతున్నారు. జీపీలో ఏర్పాటు చేసిన శిబిరంలో తాగునీరు కూడా అందుబాటులో లేదు. పంచాయతీ అవరణ మెట్లు ఎత్తుగా ఉండడం వల్ల వృద్ధులు అవి ఎక్కడానికి ఇబ్బంది పడుతున్నారు. ఒకరి సాయం లేనిదే వెళ్లలేని పరిస్థితి. వృద్ధులకు అనువుగా ఉండే చోట శిబిరం ఏర్పాటు చేస్తే బాగుండేదని పలువురు కోరుతున్నారు.

‘బీఆర్ఎస్‌ది హౌస్ అరెస్టుల పరిపాలన’

దేవరుప్పుల: ప్రజాసమస్యలపై స్పందించే ప్రతిపక్షాల గొంతుకలను మూసేందుకు హౌజ్ అరెస్టులతో బీఆర్ఎస్ పరిపాలన కొనసాగిస్తుందని వైఎస్సార్ టీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది శ్రీహరి విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉస్మానియా ఆస్పత్రిని సందర్శించడానికి వెళ్తున్న పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిలను హౌస్ అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని, ప్రభుత్వ పిరికిపంద చర్యగా అభివర్ణించారు.

సమస్యలు పరిష్కరించాలి

చిల్పూరు: మానసికి ఒత్తిడిలు, పని భారం పెరిగినా అధికారుల సూచనల మేరకు పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మండల కార్యదర్శుల జేఏసీ కన్వీనర్ రంగారెడ్డి కోరారు. మండల కేంద్రంలో మండల కార్యదర్శుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యదర్శులు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించే వరకు పోరాటం

రఘునాథపల్లి: రెండు దశాబ్దాలుగా చాలీ చాలని వేతనాలతో పని చేస్తున్న వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించే వరకు పోరాటం చేస్తామని ఆ సంఘం మండల అధ్యక్షుడు కొడిదేటి కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన వీఓఏల సమావేశంలో ఆయన మాట్లాడారు. కందుకూరి యోన, ముసిపట్ల శంకరయ్య, హరిశంకర్ పాల్గొన్నారు.

అవగాహన

జఫర్‌గఢ్: విద్యార్థులు తప్పని సరిగా విద్యలో నైపుణ్యాన్ని కలిగి ఉండాలని సామాజిక సేవా కార్యకర్త బంకా మాణిక్యరావు అన్నారు. మండలంలోని తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు సామాజిక అంశాలతో పాటు విద్యలో మెళకువలపై ఆయన మంగళవారం అవగాహన కల్పించారు.

ఆరోగంపై శ్రద్ధ వహించాలి

బచ్చన్నపేట: అందరూ తమ తమ ఆరోగ్యం పట్ల తగు శ్రద్ధ వహించాలని మండలంలోని కేసిరెడ్డిపల్లి సర్పంచ్ మల్లవరం దివ్య అన్నారు. మంగళవారం జీపీ కార్యాలయంలో ఆర్‌వీఎం ఆస్పత్రి గజ్వేల్ వారి ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. వైద్యులు ప్రవీణ్‌రాజ్, సంయుక్త, భావన, మార్కెటింగ్ మేనేజర్ మంచినీళ్ల లక్ష్మణ్, ప్రకాష్, కనుకయ్య, ఉప సర్పంచ్ నీల మధు, పంచాయతీ కార్యదర్శి అనిల్‌రాజ్, టీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కాపర్తి హరిప్రసాద్, కారోబార్ శ్రీనివాస్ , నాయకులు గాలి తిరుపతి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కొడకండ్ల: సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కొమురెల్లి సూచించారు. మంగళవారం మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, బాల్య వివాహాలపై ఎస్సై అవగాహన కల్పించారు. ఏఎస్సై రమేష్, ప్రిన్సిపాల్ సునీత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ సందర్శన

జనగామ రూరల్: గానుగుపహడ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 5 ఈ చాంపియన్ ప్రొఫైల్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌ను సందర్శించారు. హెచ్ఎం, విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతిలో పంటలు సాగుచేయాలి


మాట్లాడుతున్న బాలశౌరి

తరిగొప్పుల: సేంద్రియ పద్ధతిలో పంటలు సాగుచేయాలని లోడీ సాంఘిక సేవాసంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బాలశౌరి అన్నారు. లోడీ సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మానోస్ యూనిదాస్ సహకారంతో సంస్థ డైరెక్టర్ విజయపాల్ రెడ్డి ఆదేశానుసారం మండలంలోని మాన్‌సింగ్‌తండాలో మంగళవారం సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ నంద్యానాయక్, కోడం సత్యనారాయణ, కనకం రవీందర్, భూక్య బిచ్చ, తిరుమల, రమేష్, పాల్గొన్నారు.

కీర్తి పురస్కారం అందుకున్న ‘పసునూరి’

పాలకుర్తి టౌన్: తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా ప్రదానం చేసే కీర్తి పురస్కారాన్ని డాక్టర్ పసునూరి రవీందర్ మంగళవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ రవీందర్ చేతుల మీదుగా అందుకున్నారు. హైదరాబాద్‌లోని నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలో కీర్తి పురస్కారం ప్రదానోత్సవ సభలో రవీందర్‌కు కీర్తి పురస్కారాన్ని అందజేశారు. రచయిత డాక్టర్ పసునూరి రవీందర్ తెలంగాణ రాష్ట్రం నుంచి తొలి కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం అందుకున్నారు. పురస్కారాన్ని అందుకున్న రవీందర్‌కు సోమనాథ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ అభినందలు తెలిపారు.


కీర్తి పురస్కారాన్ని, అందుకుంటున్న రవీందర్

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి.సత్యం (S.R) : 8008671692 (పాలకుర్తి)
యం.డి. ఖలీల్ (S.R) : 8179719313 (జనగామ)
జి. రవియాదవ్ (A.C.O) : 9032782191